# చూడ చక్కనోడు

**ఆమె పేరు రూప.** పేరే కాదు రూపం కూడా అపురూపమే. గుండ్రటి ముఖం, ఎర్రని పెదాలు, చురుకైన కళ్ళు, చిక్కితే పాలుగారే చెక్కిళ్ళు, చూడముచ్చటగా వుంటుంది.

ఆమె పొందుకోసం ఎందరో యువకులు ప్రయత్నించారు. అందర్నీ కాదని ఆమె అవినాష్‌ని వలచింది. అతడు కూడా ఆమెకేం తీసిపోడు. చూడచక్కనోడు. ఆరడుగుల ఆజానుబాహుడు. ఇరువురూ ఎంతో ఇదిగా ప్రేమించుకున్నారు. నందనవనాల్లో విహరించారు. సినిమాలు, షికార్లు చేసారు. రూప అంటే అతడి కిష్టం. అతడంటే ఆమెకు ప్రాణం. 'ప్రేమికులు ఈ లోకంలో అసంఖ్యాకమే అయినా పెళ్ళి పీటలవరకూ చేరినవారి సంఖ్య బహుస్వల్పం' అన్న చరిత్ర సత్యాన్ని ఆకళింపు చేసుకున్న వాళ్ళు కాబట్టే ముందుగానే జాగ్రత్తపడాలని నిర్ణయించుకున్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఒకటిగా నిలవాలనుకున్నారు.

"త్వరలో మనం ఆలుమగలం కాబోతున్నాం. కడదాకా జీవించాలనుకుంటున్నాం. మన మధ్య ఎటువంటి అరమరికలు ఉండకూడదు.

అందుకే పెళ్ళికి ముందే మా కుటుంబ విషయాలు నీతో చెప్పాలనుకుంటున్నాను" అన్నాడు అవినాష్ గువ్వపిట్టలా ఒదిగిపోతున్న రూపతో.

చెప్పమన్నట్లుగా చూసింది రూప లేచి కూర్చుంటూ.

"మా నాన్న త్రాగుబోతు. తిరుగుబోతు. సప్తవ్యసనపరుడు. అతడితో వేగలేక నా తల్లి మృత్యువును కౌగిలించుకుంది. అటువంటివాడి కడుపున పుట్టాన్నేను. తండ్రిలాగే కొడుకు కూడా వుండాలని ఎక్కడా రూల్లేదు. నా తల్లి దీవెన కారణంగా నేను చదువుకుని వృద్ధిలోకి రాగలిగాను. అయినా నన్నంతా తాగుబోతు కొడుకంటారు. ఇప్పుడు చెప్పు నన్ను తిరిగి మునుపటిలాగే ప్రేమిస్తావా?" ఆమె కళ్ళల్లో కళ్ళుంచి అడిగాడు అవినాష్.

"అంతకంటే ఎక్కువగా ప్రేమిస్తాను. నేను ప్రేమించేది నీ మనసుని. నీ మంచితనాన్ని. ఇతర విషయాలు నాకనవసరం" అంటూ అతడి గుండెలమీద వాలిపోయింది రూప.

"నేనెంతో అదృష్టవంతుడిని రూపా, రేపు పేరయ్యగారిని కలుస్తాను. మన పెళ్ళికి ముహూర్తం పెట్టమంటాను. ఈలోగా నువ్వీ విషయం మీ అమ్మగారికి చెప్పు" ఆర్తిగా ఆమెను హత్తుకున్నాడు అవినాష్.

సిగ్గు మొగ్గయింది రూప.

ఆ రోజు రూప ఆనందానికి అవధుల్లేవు. సంతోషం పట్టలేక కూనిరాగాలు తీయసాగింది.

"ఏమిటమ్మా ఇవాళ ఇంత ఆనందంగా వున్నావు. విశేషమేమైనా వుందా?" గాలిలో తేలిపోతున్న కూతురుతో అన్నది అన్నపూర్ణమ్మ.

రూప అవినాష్‌ని ప్రేమిస్తున్న సంగతి ఆవిడకు తెలియందేం కాదు.

"అతడు నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడమ్మా. ముహూర్తం పెట్టించేందుకు వెళ్లాడు"

అన్నది రూప సంతోషంతో ఉబ్బితబ్బిబ్బైపోతూ.

"ఇంతకూ నువ్వతడితో మన విషయం చెప్పావామ్మా?" ఆదుర్దా వ్యక్తం చేసింది అన్నపూర్ణమ్మ.

"లేదమ్మా. ఎప్పటికప్పుడు చెప్పాలనే అనుకుంటున్నాను. ఎందుకో అతడు ఎదుటపడితే నోరు విడడం లేదు. రేపు ఎలాగైనా చెప్పేస్తాను. అతడు చాలా మంచివాడమ్మా. తన కుటుంబ విషయాలేవీ నాతో దాచకుండా చెప్పేసాడు. అనుక్షణం నిన్ను, నన్ను వేధిస్తున్న మన సమస్యని కూడా అతడు సానుభూతితో అర్థం చేసుకుంటాడన్న నమ్మకం నాకుంది."

"ఏమోనమ్మా. ముందుగా నీ సంగతి చెప్పకుండా మాత్రం ముందడుగు వేయడం మంచిది కాదు" హెచ్చరించింది అన్నపూర్ణమ్మ.

అలాగే అన్నట్లు తల ఆడించింది రూప.

మరి మాట్లాడలేదు అన్నపూర్ణమ్మ.

మరునాడు అవినాష్‌ని కలవడంతోనే "పెళ్ళికి ముందు నేనూ నీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలనుకకుంటున్నాను" అన్నది రూప.

"ఏమిటో చెప్పు. కాబోయే ఆలుమగల మధ్య దాపరికాలు ఉండకూడదు" అన్నాడు అవినాష్.

"అందుకే చెబుతున్నాను. నాకు నాన్న లేడు."

"చనిపోయాడా?"

"ఊహూ"

"మరి?"

"పెళ్ళి చేసుకుంటానని చెప్పి మా అమ్మను నమ్మించి నేను కడుపులో పడగానే ఆమెను మోసం చేసి పిరికిపందలా పారిపోయాడు."

"ఇప్పుడెక్కడున్నాడు?"

"తెలీదు."

"..."

"మా అమ్మే నాకు తల్లి అయి, తండ్రై సాకి నన్నింతదాన్ని చేసింది. ఆమెను కులట అంటారంతా. నా దృష్టిలో మాత్రం ఆమె దేవత. నా కోసం తన సుఖాలన్నిటినీ త్యాగం చేసింది. అందుకే ఆమెను ఎవరైనా పల్లెత్తు మాట అంటే సహించలేను" అంటూ ఆగింది రూప.

మాట్లాడలేదు అవినాష్.

"చెప్పు అవినాష్. నీకు మా నాన్న విషయం అనవసరమని, నేనే సర్వస్వమని చెప్పు" అతడి భుజాలు పట్టుకుని ఉద్వేగంతో ఊగిపోయింది రూప.

ఆమెకు అతడి నుంచి ఆశించిన సమాధానం రాలేదు.

మెల్లగా ఆమె చేతులు విడిపించుకుంటూ ముందుకు సాగిపోయాడు అవినాష్.

ఊహించని ఈ పరిణామంతో షాక్ తిన్నట్టయింది రూప.

అవినాష్ చూడచక్కనోడే. అయితే ఏం లాభం? చక్కనైన మనసు మాత్రం లేదు. మగవాడిలో ఎన్ని లోపాలున్నా ఆడది సర్దుకుపోవాలి. అదే ఆడదాని విషయానికొస్తే ఆవగింజంత లోపం ఉన్నా మగవాడు భరించలేడు. సమానత్వమట సమానత్వం. ఎక్కడుంది సమానత్వం? పెళ్ళి విషయంలో మగవాడికి అవకాశాలెక్కువ. అందుకే అతడికానిక్కు. అయితే ఆ అవకాశాల్ని ఆడవాళ్ళే ఇస్తున్నారన్న విషయాన్ని మగవాడు విస్మరిస్తున్నాడు. వనితలు తమ పంథాని మార్చుకోనంత కాలం సమానత్వం సాధించడం కల్ల. ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా అన్ని రంగాలలో నేటి స్త్రీ ముందంజలో వున్నదంటూ చేస్తున్న మహిళా మండలి ఘోష ఆత్మవంచన కాకపోతే మరేంటి అనిపించింది.

**(25-11-1999 ఆంధ్రభూమి వీక్లీ)**